విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

అన్నదాతను విస్మరిస్తే ఆహార సంక్షోభం

- కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలి
- సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా సమావేశం డిమాండ్

విశాలాంధ్ర- ఏలూరు : అన్నదాతలను విస్మరిస్తే ఆహార సంక్షోభం తప్పదని, ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. ఈనెల 21న ఏలూరులో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును, 30న విజయవాడలో జరుగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఏలూరులోని ఐ.ఎఫ్.టి.యు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా సమావేశాన్ని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి. శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని రైతాంగ సమస్యలపై చర్చించి కార్యాచరణ కార్యక్రమాలు రూపొందించారు. ఈ సమావేశంలో బికెయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల సురేష్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె.గౌస్, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి ఎస్.కె.బాషా, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిరికొండ రామారావు, ఏఐకేఎంఎస్ జిల్లా వెట్టి సుబ్బన్న, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గెద్దాల ముత్యాలరావు మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2 50 శాతం ఫార్ములాకు అనుగుణంగా అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతులను ఆదుకుని ఆత్మహత్యలను నివారించాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుండి వ్యవసాయాన్ని మినహాయించి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానానికి స్వస్తి పలకాలన్నారు.

21న ఏలూరులో ఎస్.కె.ఎం జిల్లా సదస్సు

ఈ నెల 21న ఏలూరులోని కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సదస్సులో వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులు, రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

ఏజెన్సీలో మరోసారి భగ్గుమన్న భూవివాదం

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : ఏజెన్సీలో భూవివాదం మరోసారి వివాదాస్పదమైంది. నిర్వాసితులకు, గిరిజనులకు మధ్య భూవివాదం చోటు చేసుకుంది. మండలంలోని పి అంకంపాలెం పంచాయితీ పరిధిలో గల పి నారాయణపురం గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. నిర్వాసితులకు స్థానిక గిరిజనులకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ భూమి మాది అంటే కాదు మాది అని పెద్ద ఎత్తున ఇరువర్గాలు ఆరోపణలు చేసుకుంటూ ఒకరిపై ఒకరు గొడవలకు దిగారు. కొరుటూరు, గాజుల గొంది, టేకూరు నిర్వాసితులకు సుమారు 240 ఎకరాలు కేటాయించి పట్టాదార్ పాస్ బుక్కులు మంజూరు చేశారని నిర్వాసితులు తెలిపారు. స్థానిక గిరిజనులు మాకు కోర్టు ఆర్డర్లు ఉన్నాయంటూ గిరిజన నాయకుడు మడకం వెంకటేశ్వరరావు ఆరోపిస్తున్నాడు. పోలీసులు రెవిన్యూ శాఖ అధికారులు సర్దిచెప్పి ఉన్నతాధికారులకు తెలియజేసి మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఇరు వర్గాల గిరిజనులు వెళ్లిపోయారు.

వ్య.కా.సం. కొయ్యలగూడెం మండల కార్యవర్గం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కొయ్యలగూడెం మండల కార్యదర్శిగా తాడిగడప ఆంజనేయ రాజును, మండల అధ్యక్షులుగా చింతలపూడి దుర్గారావును, గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల నారాయణ రావును, సహాయ కార్యదర్శిగా కండెల్లి బాలస్వామిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ధగని సుబ్బారావు, మొటూరు నారాయణ, గుదే శ్రీను లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో తిమ్మన కుంట గ్రామంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో వీరి ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. పదవి బాధ్యతలు అప్పజెప్పిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తరపున కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

దళితులకు శ్మశాన వాటికలకు స్థల కేటాయింపు హర్షణీయం

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రంలో 1700 గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికల నిమిత్తం 1050 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదించ డాన్ని స్వాగతిస్తున్నామని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరం 21వ వార్డు లో జరిగిన దళిత ఐక్య వేదిక శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు శ్మశాన వాటికలు లేకపోవడంతో కాలువ గట్లు, రోడ్లు ప్రక్క పుంతల్లో, ఏరుల్లో, చెరువు గట్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ దయనీయ పరిస్థితుల్లో ఖననం చేస్తున్నారని ఇప్పుడు ఆ సమస్య తీరిందని సంతోషం వెలిబుచ్చారు. మరో 266 గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయించుకోవడం పట్ల ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలపర్తి జోనా, పట్టెం శుభాకర్, ఉంగ్రు విల్సన్, అంబటి ఆనందకుమార్, తాటిపాక శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మహిళలంతా రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం వద్ద మంగళగిరిలో శుక్రవారం నిర్వహించిన మహిళా శక్తి రథయాత్రకు కొయ్యలగూడెం పట్టణం నుండి మేఘలాదేవి ఆధ్వర్యంలో మహిళలంతా వెళ్లడం జరిగిందనిఆమె పేర్కొన్నారు. మహిళలంతా కలిసి తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి కృషి చేస్తామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా శక్తిని చాటి చెపుతాం అని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో మార్పు రావడం జరిగిందని మేఘలాదేవి తెలిపారు.

నరసాపురం నుండి గుంటూరు వెళ్లే ఫాస్ట్ ప్యాసింజర్ పునరుద్ధరించాలి

- ఎంపీ రఘురాం కృష్ణంరాజు

విశాలాంధ్ర -ఉండి : నరసాపురం నుండి పాలకొల్లు, వీరవాసరం భీమవరం ఉండి ఆకివీడు కైకలూరు గుడివాడ విజయవాడ మీదుగా ఉదయం ఆరు గంటలకు బయలుదేరు ఫాస్ట్ ప్యాసింజర్ ను పునరుద్ధరించాలని రైల్వే డివిజనల్ మేనేజర్ కి లేఖ రాసి పంపించినట్లు నరసాపురం పార్లమెంట్ సభ్యులు కనుమూరి రఘురామకృష్ణం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపురం నుండి బయలుదేరు ఫాస్ట్ ప్యాసింజర్17282 నెంబర్ గల బండిని పునరుద్ధరించాలని నిత్యం వేలాది సంఖ్యలో ఫాస్ట్ ప్యాసింజర్ పై ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. దీనివల్ల రైల్వే శాఖ కి నష్టం వాటిల్లుతుందని అన్నారు. విజయవాడ వైపు వెళ్తున్న విద్యార్థిని విద్యార్థులు, వ్యాపారవేత్తలు ,దుర్గమ్మ తల్లి గుడికి వెళ్లినవారు చిన్న కాకాని పెదకాకాని వెళ్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే రైల్వే ఉన్నతాధికారులు స్పందించి పాస్ట్ పాసింజర్ బండిని పునరుద్దించాలని ప్రజల తరఫున వారు డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గంజిమల రామారావు పేర్కొన్నారు. మండలంలో కన్నాపురం సచివాలయం -2 లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ గంజిమల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరే విధంగా ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికై జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని, ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ అధికారులు పనిచేయాలని రామారావు తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ ఉప్పల పద్మవతి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్, వైయస్సార్ పార్టీ నాయకులు ఉప్పల కృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కే బాజీ,ప్రభుత్వ కార్యాల యాల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

By this deed I the under signed MYLA SITA (New Name), previously called KOPPADI NAGAMANI (Old Name), resident of Door No.6-124, Chinaminavanilanka, Vemuladeevi West, Narasapuram Mandal, West Godavari Distrct-534275, Andhra Pradesh, (address) solemnly declare my actual name is as mentioned MYLA SITA in records. I have applied for the change of spelling correction of Name and Surname in my Records.

టైమ్స్ ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్‌కెఆర్‌కు మూడో స్థానం

విశాలాంధ్ర -భీమవరం: దేశంలో ప్రతిష్టాకరమైన టైమ్స్ గ్రూప్ ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన టైమ్స్ ఇనిస్టిట్యూట్స్ ర్యాంకింగ్ సర్వే 2023లో ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు మూడో ర్యాంక్ ప్రకటించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జగపతి రాజు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ ఆర్ కే నిషాంతవర్మ కు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ ఆర్ కె నిషాంత్ వర్మ మాట్లాడుతూ కెరీర్ 360 సంస్థ కూడా నిర్వహించిన సర్వేలో తమ కళాశాలకు ట్రిబుల్ ఎ ప్లస్ ర్యాంక్ వచ్చిందన్నారు. కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులు ప్లేస్మెంట్స్, ప్రయోగశాలలు, టెక్నాలజీ సెంటర్, ఐడియా ల్యాబ్ తదితర అన్ని అంశాలు పరిగణలోకి తీసుకొని ర్యాంకింగ్స్ ప్రకటించారన్నారు. గత ఏడాది కూడా తమ కళాశాలకు టైమ్స్ ర్యాంకింగ్ రావటం టైమ్స్ యాజమాన్యం నుండి ప్రత్యేక అవార్డు కూడా పొందడం జరిగిందని వివరించారు. ఇటీవలే అమెరికాలో జరిగిన ఎస్ ఆర్ కె ఆర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంనకు అక్కడ పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరై తమ విజయానికి కళాశాల కారణం అంటూ వారు అందించిన ప్రశంసలు తమకు తమ కళాశాలకు ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-ఏలూరు : భారత ప్రభుత్వం అందించే 'పద్మ ' పురస్కారాలకు జిల్లాలో అర్హులైన వారి వివరాలు ఆగష్టు, 10వ తేదీ లోగా అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం 'పద్మ' పురస్కారాలపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ కళలు, భాషా సాహిత్యం, విద్య,క్రీడలు, వైద్యం, సమాజ సేవ, శాస్త్ర సాంకేతికత, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, వానియా మరియు పరిశ్రమలు మొదలైన రంగాలలో నిష్ణాతులు మరియు విశిష్ట సేవలందించిన వారికి భారత ప్రభుత్వం ప్రతీ ఏటా భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'పద్మ' పురస్కారాలను అందిస్తున్నదన్నారు. ఏలూరు జిల్లాలో 'పద్మ' పురస్కారాలకు అర్హులైన వారిని గుర్తించి వారి వివరాలు, వారు ఏ రంగంలో నిష్ణాతులు, వారు చేసిన సమాజ సేవ, తదితర వివరాలను ఆన్లైన్ ద్వారా ఆగష్టు, 10వ తేదీ లోగా అందించాలన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులు, సమాజ సేవ చేసిన వారు కూడా ఆన్లైన్ లో ఆగష్టు, 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్. ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవిన్యూ అధికారి ఏ .వి. ఎన్ .ఎస్. మూర్తి, డి ఆర్ డి ఏ పీడీ విజయరాజు, డీ ఈ ఓ రవిసాగర్, బి సి కార్పొరేషన్ ఈ డీ ఎన్ . పుష్పలత, జిల్లా బిసి. వెల్ఫేర్ అధికారి నాగరాణి, డిఎస్పీ కృష్ణంరాజు, సెరికల్చర్ అధికారి డి. వాణి , ప్రభృతులు పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర, జంగారెడ్డిగూడెం : స్థానిక 7,8,9 వార్డు ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న లో ఓల్టేజ్ సమస్య,అధిక లోడు సమస్య పరిష్కారం అయినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజ నేయులు(అంజి) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు స్థానిక 8వ వార్డులో 100 కే.వి.విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను వేసినట్లు ఆయన తెలిపారు. గత వేసవి కాలమంతా విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య,తక్కువ సామర్థ్యం కలిగిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వల్ల ప్రతీ రోజు సమస్యలు వచ్చేవని తెలిపారు. దీంతో తాను విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి 100 కే.వి.ట్రాన్స్ఫార్మర్ వేయాలని కోరడంతో వారు మంజూరు చేశారని తెలిపారు.

వ్యవసాయ కార్మిక సమస్యలపై

భవిష్యత్ కార్యాచరణ

25న జంగారెడ్డిగూడెంలో ప్రథమ మహాసభ

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ జూలై 25 వ తేదీ జంగారెడ్డిగూడెంలో జరుగుతుందని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బికెఎంయు రెండుగా విడిపోవడం వల్ల ఏలూరు జిల్లా మహాసభ ఈనెల25వ తేదీన జంగారెడ్డి గూడెం ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. 25వ తేదీ ఉదయం గం.10లకు వందలాదిమంది గ్రామీణ పేదలు వ్యవసాయ కార్మికులతో ప్రదర్శన 11 గంటలకు కళ్యాణ మండపంలో మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని తెలిపారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బోడ వజ్రం, జిల్లా అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ జిల్లా నాయకులు పాల్గొంటారని వెంకటేశ్వరరావు తెలిపారు. 1936లో ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం గత 87 సంవత్సరాలుగా పేద ప్రజలకు భూమికోసం, భుక్తి కోసం, సాగు భూముల సొంతం కోసం అనేక ఉద్యమాలు ఆందోళనలు పోరాటాలు నిర్వహించి లక్షలాది మంది పేదలకు ఇండ్ల స్థలాలు, సాగు భూములు సాధించి పెట్టిందని ఆయన తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో గత 6 దశాబ్దాలుగా 25 వేల ఎకరాలు అడవి బంజర్లు పేదలకు సాధించడం జరిగిందని, వాటిలో 10వేల ఎకరాలకు పట్టాలు రావాల్సి ఉందన్నారు. చింతలపూడి, కామవరపుకోట టి.నరసాపురం మండలాలలో అడవి బంజరు పోరాటం చేసి వందలాదిఎకరాలు పేదలకు సాధించి పెట్టిన ఘనత ఏపీ వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందన్నారు. వేలాది ఎకరాలలో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేయడంలో వ్యవసాయ కార్మిక సంఘం కీలక పాత్ర వహించిందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో పేదల స్వాధీనంలో ఉన్న 10వేల ఎకరాల బంజరు భూములకు పట్టాల కోసం, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలంలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు గిరిజనేతర పేదలకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వన సంరక్షణ సమితులకు కేటాయించిన భూములను సమితి సభ్యులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం పనులు జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకూలి రూ.600 ఇవ్వాలని, గ్రామీణ పేదలు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్టు బండి వెంకటేశ్వరరావు తెలిపారు.

కష్టాన్ని కాజేసిన మోసగాళ్లను పట్టుకోండి

తమ డబ్బులు తమకు ఇప్పించండి

విశాలాంధ్ర-లింగపాలెం : ధర్మాజిగూడెంలో అధిక వడ్డీలు ఇస్తామంటూ పేదల నుంచి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా ఉన్న ఇరువురు వ్యక్తులపై చర్యలు తీసుకుని తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు అధికారులను కోరుతున్నారు. ఇద్దరు వ్యక్తులు దాదాపు 150మంది నుంచి రూ.3 కోట్లు అప్పుగా తీసుకున్నారు. వీరిలో ఒక ఉద్యోగి రూ 2.50 కోట్లు మరో వ్యక్తి రూ. 50 లక్షలు తీసుకున్నాడని బాధితులు తెలిపారు. కూడబెట్టుకున్న డబ్బులకు వడ్డీ వస్తుందని ఆశతో ఇచ్చామని డబ్బులు తీసుకున్న ఇరువురు మోసగించారని వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ కు, ఎంఎల్ఏ ఎలీజ కు ఫిర్యాదు చేశామని అయినప్పటికీ డబ్బులు తీసుకున్న వ్యక్తులు లెక్కలేనట్టుగా ఉన్నారని బాధితులు పేర్కొన్నారు. వీరు కనిపించకుండా తిరుగుతున్నారని వీరి ఆచూకీ తెలుసుకుని డబ్బులు ఇప్పించాలని కోరుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారమంతా కష్టపడి అవసరాలకోసం కూడబెట్టు కున్నదని తెలివిగా తమవద్ద నుంచి డబ్బులు కాజేసారని వీరు ఆరోపించారు. డబ్బులు కాజేసిన వ్యక్తుల ఆచూకి తెలుసుకోవడం పెద్ద కష్టం కాదని ఈ వ్యవహారంపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నిస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఉన్న సమయంలో వీరి ఆచూకి కనిపెట్టకపోవటం అనుమానాలకు తావిస్తోందని పలువురు బాధితులు అంటున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కష్టాల్లో ఖరీఫ్ సాగు

- సకాలంలో కురవని వానలు, శివారు భూములకు చేరని కాలువ నీరు
- విత్తనాలు మళ్లీ చల్లేందుకు సిద్ధమవుతున్న రైతులు

విశాలాంధ్ర-మండవల్లి: ఖరీఫ్ సాగుకు ఆదిలోనే కష్టాలు ఆరంభం అయ్యాయి.వస్తే అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్నట్లు వరి సాగుదారుల ప్రస్తుత పరిస్థితి ఉంది.ముందస్తు సాగువల్ల విపత్తుల నుండి పంటను దక్కించుకోచ్చని ఆశించిన రైతాంగానికి ఈఏడాది భంగపాటు తప్పేటట్లు లేదు.సాగుఖర్చులను నియంత్రించు కునేందుకు రైతులు అధికశాతం భూముల్లో నేరుగా వెద పద్ధతిని ఆచరిస్తున్నారు. సాధారణంగా మే నెలలోనే మెట్టదుక్కులు చేసిన రైతులు వాతావరణాన్ని చూసుకుని జూన్ నెలలోనే విత్తనాలను చల్లేస్తారు.వరుణుడు కరుణిస్తే విత్తనాల మొలకశాతం ఆశించిన స్థాయిలో ఉంటుంది. కాలువలకు నీటివిడుదల సక్రమంగా సాగినా నీటితడులతో మొలకలను రైతులు రక్షించుకుంటారు. ఈఏడాది జూన్‌నెల రెండవ వారం నుండి రైతులు వెదసాగును చేపట్టగా సకాలంలో వానలు కురవకపోవటం,కాలువలకు నీటివిడుదల సాఫీగా లేకపోవటం శివారు భూములకు నీరు చేరకపోవటంతో పొలాల్లో చల్లిన విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకలు రాకపోవటంతో రైతులు మళ్లీ విత్తనాలను చల్లేందుకు సమాయత్తం అవుతున్నారు. వరుణుడు పూర్తిస్థాయిలో కనికరించకపోవటం, కాలువలకు సామర్థ్యం మేర నీటివిడుదల జరగకపోవటంతో ఖరీఫ్ రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. రెండవ దఫా విత్తనాలను చల్లితే ఆలస్యమవుతుందని రైతులు వరి నారు కోసం సమీప గ్రామాల వైపు పరుగులు పెడుతున్నారు. వ్యయ ప్రయాసలు సాగు ఆరంభంలోనే మొదలు కావటంతో ఖరీఫ్‌కు సమస్యలు తప్పవని రైతాంగం వ్యాఖ్యానిస్తున్నారు.

పంట కాలువల నుండి నీటిని పొలాలకు మళ్లించటానికి ఇంజన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వెద సాగు భూముల్లో వరి మొలకలు తగ్గి కలుపు ఏపుగా పెరగటంతో నివారణకు రసాయనాలు పిచికారి చేస్తున్నారు.రెండు సార్లు విత్తనాలను చల్లటం, నారును కొనుగోలు చేయల్సి రావటంతో సాగు ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం ఎరువుల కొరత లేదని ఆర్బికేలో వివిఎలు అందుబాటులో ఉంటున్నారని తెలుపుతున్నారు.

సరసమైన ధరకు నాణ్యమైన బియ్యం

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందజేసే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు బజార్‌లో జిల్లా యంత్రాంగం నిర్దేశించిన రేట్లకే నాణ్యమైన బియ్యం అమ్మకానికి ఏర్పాటుచేసిన స్టోర్‌ను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో బియ్యం రేట్లను నియంత్రించేందుకు సివిల్ సప్లై అధికారులు, చాంబర్స్ ఆఫ్ కామర్స్, హెూల్ సేల్ బియ్యం వ్యాపారస్థుల సమన్వయంతో ప్రభుత్వ స్టోర్ లలో బియ్యం అమ్మకాలను ప్రారంభించినట్లు తెలిపారు. నేడు భీమవరంలో తొలి స్టోర్ ప్రారంభించడం జరిగిందన్నారు. బహిరంగ మార్కెట్లో ధరకు ప్రభుత్వ స్టోర్ ధరకు పది రూపాయల వరకు వ్యత్యాసం ఉందన్నారు. బహిరంగ మార్కెట్లో సాధారణ రకం రూ.42, ఫైన్ రకం రూ.45, సూపర్ ఫైన్ రకం రూ.55 ఉండగా, ప్రభుత్వ స్టోర్ లో వరుసగా రూ.34, 40,46ధరలు నిర్ణయించి, అమ్మకాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ స్టోర్స్ లో కందిపప్పు కూడా విక్రయాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ తణుకు, తాడేపల్లిగూడెం, ఆకివీడు పట్టణాల్లో రేపు శనివారం బియ్యం స్టోర్ లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం పది మండలాల్లో బియ్యం స్టోర్లు ఏర్పాటుకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇటీవల టమాటా ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో తక్కువ ధరలకు టమాటాలను అందించేందుకు పలమనేరు నుండి తెప్పించి రైతు బజార్ ల ద్వారా అమ్మకాలు చేపట్టడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డి ఎస్ ఓ ఎన్.సరోజ, మెప్మా పిడి గ్రంధి పార్వతి, హార్టికల్చర్ ఏడి దుర్గేష్, మార్కెటింగ్ ఏడి కె.సునీల్ కుమార్, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి. కళ్యాణ్, రైస్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ సుధాకర్ రావు, ప్రతినిధి ఏం.ఎస్.ఏన్ గుప్తా, మెప్మా, సివిల్ సప్లై మార్కెటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పడమటిపాలెం గ్రామంలో రూ 21.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు కు రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం జగనన్న కాలనీలలోని వీధి దీపాలకు విద్యుత్ లైన్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా సిసి రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, సర్పంచి సాన మీనా సరస్వతి, ఎంపీటీసీ టేక్కెం. శ్యామ్, ఏఎంసి వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైసిపి మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, నంబూరి శ్రీదేవి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు డెంగీ బారిన పడవద్దు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కాశిపాడు గ్రామంలో డెంగ్యూ నివారణ మాసోత్సవాలు, ఫ్రై డే డ్రై డే పై అవగాహన కార్యక్రమం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కె. ప్రియాంక శుక్రవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు డెంగ్యూ నివారణ మాసోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు.పరిసరాలు పరిశుభ్రత మన అందరి బాధ్యత మన ఆరోగ్యం మన చేతుల్లోనే వున్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాల రాజు, ఏఎన్ఎం పి. శివ కుమారి, డీఈవో వసంత, ఆశ కార్య కర్తలు వరలక్ష్మీ,కృష్ణ కుమారి,అంగన్ వాడి టీచర్ యం మేరి గోల్డ్,ఎం ఎల్ హెచ్ పి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంటల సాగు

విశాలాంధ్ర-మండవల్లి: ప్రకృతి వ్యవసాయంతోనే భూమి ఆరోగ్యంగా ఉంటుందని జీవరాశుల మనుగడకు ఆటంకాలు ఉండవని ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సిఆర్పి గౌతమ్‌కుమార్, మండల ఇంచార్జి నాగవిజయ అన్నారు.కొర్లపాడు గ్రామంలో సూర్యమండలం ఆకారంలో కూరగాయల మొక్కల విత్తనాలను బీజామృతంలో విత్తనశుద్ధి చేసి నాటారు.తక్కువ స్థలంలో ప్రకృతి సాగు పద్ధతిలో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని గౌతమ కుమారు అన్నారు.స్థలం ఉన్న వారు ఈపద్ధతిలోనే స్థలాలు లేనివారు మేడపైన టెర్రస్పు వేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఐసిఆర్పిలు రామారావు, రామాంజనేయులు,ఐబిఐసిఆర్పి నాగమణిలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ రైతుగా పుట్టి సుబ్బారావు

విశాలాంధ్ర-ముదినేపల్లి : జిల్లా ఉత్తమ రైతుగా ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన పుట్టి సుబ్రమణ్యేశ్వరరావు (సుబ్బారావు)కు రైతు దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్, కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సామినేని ఉదయభాను నుండి 10వేలు నగదు, ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నారు. వరి సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించినందుకు గాను ఈ అవార్డు లభించింది. అవార్డు అందుకున్న రైతు పుట్టి సుబ్బారావును ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య , వైస్ ఎంపీపీ రాచూరి రాధ , నాయకులు కోమటి విష్ణువర్ధన్ , సాక్షి సాయి , మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కె అల్లాబక్షు, శీలం రామకృష్ణ తదితరులు సత్కరించారు.

అర్హులకు సంక్షేమ పథకాల అందజేత ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-ముసునూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకటప్రతాప్‌అప్పారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని సచివాలయంలో ఎంపిడిఒ జి.రాణీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు అందించడం జరుగుతుందని,ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు డాక్టరేట్ ప్రతాప్,వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు,వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన,వైస్ ఎంపిపి -2 పాముల గంగధరరావు, తహశీల్దార్ దాసరి సుధ సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,పలు శాఖల అధికారులుపాల్గొన్నారు.

సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండలంలోని వంకవారి గూడెం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పివి శ్రీనివాస్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి

పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ప్రభుత్వం అందించే 11 రకాల ఉచిత సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలోని రోడ్లు. మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉండే కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు కోరగా ఉన్నతాధికారులకు సమస్యలపై నివేదిక అందిస్తామని ఆయన అన్నారు. సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మొక్కలను నాటారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోచమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు, సర్పంచ్ కుంజ పార్వతి, ఎంపీటీసీలు ఎం వెంకటలక్ష్మి, సున్నం సురేష్, ఎంపీడీవో కె కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ జి సుందర్ సింగ్, నాయకులు కుంజా చిన్న రాముడు, వంకా రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన, కుమ్మరి సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ పురుషోత్తం

విశాలాంధ్ర -భీమవరం : ఆంధ్రప్రదేశ్ శాలివాహన, కుమ్మరి సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.పురుషోత్తం, కమిటీ సభ్యులు శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం శాలివాహన సంస్థ చైర్మెన్, కమిటీ సభ్యులు జిల్లా కలెక్టరుతో మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి

కమ్యూనిటీ ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాలను పొందుతున్నారని, కమ్యూనిటీ ప్రజలను అన్ని అంశాలలో అభివృద్ధి చెందదానికి కృషి చేస్తున్నట్లు కలెక్టరుకు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా అధికారి జివియస్ కె. గణపతి రావు, శాలివాహన కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, పెనుగొండ లక్ష్మి, సకినేటిపల్లి ఉమామహేశ్వర రావు, యర్రవరపు రామకృష్ణ, తదితరులు వున్నారు.

ఆకివీడు ఇన్‌చార్జి ఎస్ఐగా సత్యసాయి

విశాలాంధ్ర - ఆకివీడు : ఆకివీడు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా టి.సత్య సాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆకివీడు ఎస్ఐగా పని చేస్తున్న కొవ్వూరు రాజారెడ్డి దీర్ఘకాలిక సెలవు పై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి ఎస్ఐగా సత్య సాయి ని

నియమించారు. సత్య సాయి భీమవరం వన్ టౌన్, ట్రాఫిక్, ఏలూరు స్పెషల్ బ్రాంచ్, కంట్రోల్ రూమ్ లలో పనిచేశారు. విఆర్ నుండి ఈయనను ఆకివీడు ఇన్చార్జి ఎస్ఐగా నియమించారు.

17న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర-కామవరపుకోట : ఈనెల 17వ తేదీన కామవరపుకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు మేడవరపు ఛాయా విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కామవరపుకోట ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై చర్చ జరుగుతుందని ఎంపీటీసీలు. సర్పంచులు. మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

ట్రిబుల్ ఐటీలో నలుగురు గురుకుల విద్యార్థులకు చోటు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: పెద తాడేపల్లి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ లో చోటు లభించిందని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపల్ బి. రాజారావు తెలిపారు గేదెల బాబి, అయినపర్తి వెంకట్ లకు ఒంగోలులోని ట్రిబుల్ ఐటీలో, వదలి సురేష్ కుమార్,కనిపెడ కార్తీక్ లకు శ్రీకాకుళంలోని ట్రిబుల్ ఐటీలో చోటు లభించిందని ప్రిన్సిపల్ తెలిపారు. తమ పాఠశాల చెందిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీ లో సీట్లు సంపాదించడం గర్వ

కారణం అన్నారు సీట్లు సాధించిన విద్యార్థులు మరింత ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు సాధించాలని ఆకాంక్షించారు నలుగురు విద్యార్థులను డి సి ఓ భారతి, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

టీడీపీ విజయానికి మహిళలు కృషి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి మహిళలంతా కలిసి కృషి చేస్తామని ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ తెలిపారు. శుక్రవారం మంగళ గిరిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన మహాశక్తి

రథయాత్రకు కొయ్యలగూడెం పట్టణం నుండి చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి తరలి వెళ్లడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

శాకంబరి అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

విశాలాంధ్ర-వీరవాసరం: ఆషాఢమాస శుక్రవారం సందర్భంగా గ్రామదేవతలు కోటసత్తెమ్మ,గోగులమ్మ అమ్మవార్లను కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లతో శాకంబరి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవార్లను అధిక సంఖ్యలో

దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మానవతా సేవల్ని విస్తృతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మానవతా సంస్థ సేవలను సంస్థ సభ్యులు మరింత విస్తృతం చేయాలని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు గంగాధర్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాల వద్ద 2023 - 2024 సంవత్సరానికి నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన మండల అధ్యక్షులు బొమ్మ

మోహన్ రావు, సెక్రెటరీగా తిర్నాతి సిద్ధార్థ, ట్రెజరర్ గా దిద్దే వెనేజర్, ఉపాధ్యక్షులుగా ఒబిలిశెట్టి నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా బూచి త్రిమూర్తులు,మందపాటి రామకృష్ణలను నియమించి వారితో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలోకన్వీనర్ త్రిపుర రమేష్, జిల్లా సభ్యులు సూర్యనారాయణ, కేంద్ర రైల్వే బోర్డు మెంబర్ బొల్లిన నిర్మల కిషోర్, ప్రకాశం విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.జనార్ధన్ రావు,వివిఎస్ఎన్ స్వామి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు,నిడదవోలు రామారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు విశ్వనాథ శాస్త్రి,మానవతా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆర్థికాభివృద్ధికి సమగ్ర వ్యవసాయ విధానం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకు మేలు జరుగుతుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ తోలేటి జానకిరామ్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామంలో గల డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గేదెల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ వారోత్సవాలు 14వ తేదీ శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పశుగ్రాసాల ప్రాముఖ్యత మేలుజాతి పశుగ్రాసాల సాగు గురించి అవగాహన కలిగించారు. ఈ సభకు పెంటపాడు వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ పి.మహేష్ స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వైయస్సార్ హార్టి కల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానం పాడి... ఇలా వివిధ రకాల కార్య

కలాపాలు అన్నింటిని సమీకృతం చేయడం ద్వారా రైతుకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంటతో పాటు పాడి రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వారోత్సవాల సందర్భంగా వివిధ రకాల పశుగ్రాసాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హార్టికల్చర్ హబ్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. కూరగాయలు, పండ్లు ఉత్పత్తిలో దేశంలో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. మామిడి, అరటి పండ్లను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా 75% సబ్సిడీ మీద పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేస్తున్నామ న్నారు. జిల్లాలో 14.36 టన్నులు పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గేదెల పరిశోధన స్థానం హెడ్ , ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ ఇక్కడ 60 ఎకరాలలో సూపర్ నేపియర్ పశుగ్రాసాన్ని సాగు చేసి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు కూడా సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పశు గ్రాసంతో పశువులకు పోషక విలువలు అందటమే కాకుండా అధిక పాల దిగుబడిని ఇస్తాయన్నారు. ఈ సభలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె మురళీకృష్ణ, హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకురాలు డాక్టర్ ఈ. కరుణశ్రీ , పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ భాస్కర్, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ,, వెంకట రామన్నగూడెం గ్రామ సర్పంచ్ పోలిమోను నాగ అంజుష శ్రీనివాస్, ఇంకా పలువురు పాడి రైతులు, పశుగ్రాసం పెంపకం దారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అద్భుతం

విశాలాంధ్ర-వీరవాసరం: రాష్ట్రంలో ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అద్భుతమని, జగనన్న సురక్ష పథకంలో ఒకేరోజు 3,400 సర్టిఫికెట్లను ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేయడం అంటే సాధారణ విషయం కాదని, ఈ ఘనత సాధించిన వీరవాసరం సచివాలయ పరిధిలోని వలంటీర్లను, సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం 1 సచివాలయ పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష పథకం సభలో 3 వేల 400 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న సురక్ష పథకంలో మొదటి స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం రాత్రి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి గాని ఇతర అవసరాలకు గాని అప్పటి కప్పుడు సర్టిఫికెట్లు పొందడంలో కొంతమేర ఇబ్బంది ఉంటుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నార న్నారు. ఈ పథకంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వారికి అవసరమయ్యే సర్టిఫికెట్లను అందించడం అంటే దేశంలో ఏ రాష్ట్రంలో అయినా ఇటువంటి పథకం అమలు అవుతుందా అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమైనదని, కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వారికి కేటాయించిన ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటి కప్పుడు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించే వారని ఆయన తెలిపారు.

దుప్పలపూడిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - అనపర్తి : ప్రభుత్వ సేవలు పొందడానికి అవసరమైన సర్టిఫికెట్లు అందించాలని ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. శు

క్రవారం దుప్పలపూడిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ స్థానిక ఆరోగ్య కేంద్రంలో బిపి, షుగర్ వంటి వివిధ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ అనపర్తి టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల దుర్గమ్మ ఆలయంలో తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన చెన్న పవన్ కుమార్ శాలిని దంపతుల కుమారునికి పటికి బెల్లంతో తులాభారం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కమిటీ సభ్యులు కామిశెట్టి దుర్గారావు, పైడికొండల వెంకటేశ్వరరావు, కామిశెట్టి ధర్మయ్య, కామిశెట్టి మంగ, మాజీ ఎంపీటీసీ చీట్లు కాశి అన్నపూర్ణ, సుబ్బారావు, పైడికొండల శివయ్య, మహిళా భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్వా రైతులు ఐక్యంగా పోరాడాలి

- ఎంఎంసి మాజీ చైర్మన్ గాంధీ భగవాన్ రాజు

విశాలాంధ్ర - పాలకొల్లు: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని అధిగమించడానికి ఐక్యంగా పోరాడాలని పాలకొల్లు ఎఎంసి మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కోరారు. శుక్రవారం పాలకొల్లు ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో జిల్లా ఆక్వా రైతుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొయ్యల రైతులు ఐక్యంగా లేకపోవడంతో గిట్టుబాటు ధరలు లేక నష్టాలబారిన పడుతు న్నారని చెప్పారు. ప్రాసెస్ యూనిట్లు, ఫీడ్,హేచరీలు రైతులను

దోచేస్తున్నాయని రైతులు ఐక్యంగా ప్రభుత్వంతో పోరాడి గిట్టుబాటు ధర తెచ్చుకొంటే నష్టాల ఊబి నుంచి గట్టెక్కుతారని చెప్పారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు క్రాప్ హాలిడే ప్రకటించాలని ఆయన కోరారు.

గిట్టుబాటు ధర రాకపోతే అవసరం అయితే ఒక ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించాలని అపుడు ప్రభుత్వం తో పాటు అన్ని ఫ్యాక్టరీలు దిగి వస్తాయని అన్నారు. మరో రొయ్యల సాగు రైతు బోణం చినబాబు మాట్లాడుతూ నాణ్యమైన సీడ్ హేచరీస్ లో దొరక్క రైతులు ఆదిలోనే నష్టపోతున్నారని చెప్పారు.

రైతుల సమస్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసికెళ్ళాలని రైతు పెన్మెత్స సత్యనారాయణ రాజు చెప్పారు.ఆక్వాజోన్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేస్తోందని జాన్ రాజు చెప్పారు. ప్రొసెస్, ఫీడ్, సీడ్ ప్రతినిధి లతో సమావేశం ఏర్పాటు చేసి సహకరించని వారిని రైతులు బహిష్కరించాలని కోడి విజయ భాస్కర్ కోరారు. రొయ్యల్లో అనేక పోషకాలు ఉన్నాయని స్థానికంగా కూడా వాడకం పెరిగితే రొయ్యల రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారని చెప్పారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు .

ర్యాలి గ్రామంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలి గ్రామంలో ఒకటి ,రెండు సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల 3888 ధృవపత్రాలను

ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎన్నో రకాల సర్వీసులను గ్రామ సచివాలయం ద్వారా అందించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ సర్వీసులను ఉచితంగా ఇంటింటికి అందించే కార్యక్రమం నిర్వహించడం చాలా శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నెలాఖరు వరకు అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిఎన్ అనిల్ కుమార్, అవుట్ సోర్సింగ్ డైరక్టర్ కప్పల శ్రీధర్, జెడ్‌పిటిసి సభ్యులు బోణం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాయింట్ సెక్రటరీగా మద్దుల ఎంపిక

విశాలాంధ్ర- కొవ్వూరు : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్ర ప్రదేశ్ జాయింట్ సెక్రటరీగా కొవ్వూరు చెందిన మద్దుల సత్యనారాయణ ఎంపికయ్యారు. అధ్యక్షులు కోన శ్రీనివాసరావు నుంచి నియామటి

పత్రం అందుకున్నారు. ఈయన లా విద్యను అభ్యసించడమే కాక ప్రముఖ వ్యాపారిగా కొనసాగుతున్నారు గతంలో ఈయన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా సేవలందించారు. ఈయన నియామకం పట్ల పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణ పెద్దలు తదితరులు అభినందనలు వ్యక్తం చేశారు.

15, 16 తేదీల్లో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని బి.ఆర్.ఆర్.జీ.కే ఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో జులై 15, 16 తేదీలలో కాలేజ్ క్యాంపస్ నందు ప్రముఖ 18 కంపెనీలు సాఫ్ట్వేర్, బ్యాంకులు, పారామెడికల్ కంపెనీలలో ఉద్యోగ నియామకాల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్

అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు తదితర పెద్దలను ఆహ్వానించినట్లు తెలిపారు. పాలకొల్లు, తణుకు, నరసాపురం, తాడేపల్లిగూడెం తో పాటు తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని కాలేజీ విద్యార్థులను ఈ మెగా జాబ్ మేళాలో ఉద్యోగాల కోసం ఆహ్వానించామని తెలిపారు.

ఈ సంవత్సరం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం ఆంధ్రప్రదేశ్ డిగ్రీ హానర్స్ నన్నయ యూనివర్సిటీ ఎన్నుకున్నామని, ప్రవేశాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయని ప్రభుత్వం దీనిపై ఒక ఏడాది ముందు అవగాహన కల్పించినట్లయితే బాగుండునని అన్నారు.

జీవో నెంబర్ 22 దీని ప్రకారం ఫీజు రెగ్యులేషన్ కమిటీ ఫీజులు తగ్గించాయని, ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో జీతాలు ఇవ్వాలంటే కళాశాల యాజమాన్యాలు ఈ తగ్గిన ఫీజుల విధానంతో ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇతర దేశాలలో ఎమ్మెస్ చేయాలంటే నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మోర్త, సూర్యారావుపాలెంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ప్రజల వద్దకు నేరుగా సంక్షేమ ఫలాలు చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు మోర్త పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు ఆలపాటి సరేంద్ర.

గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సేవలను ఉచితంగా గ్రామంలోనే పొందవచ్చని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని సూర్యారావు పాలెం, మోర్త గ్రామాలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంను నిర్వహిం చారు. మోర్తలో 1342, సూర్యారావుపాలెంలో 1345పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, తహసిల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో, జివిఎస్ఆర్‌కె రాజు, ఎంపీటీసీలు, ఆయా గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, అర్జీదారులు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్వాడి సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కరప : కరప మండలం కరప గ్రామం రామ కంచి రాజు నగర్ కాలనీ నందు అంగన్వాడి సెంటర్ 148లో అంగన్వాడి సహాయకురాలు పోస్ట్ ఖాళీ ఏర్పడిందని ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. ఎస్సీ కేటగిరికి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఈ దరఖాస్తులను కాకినాడ ఐసిడిఎస్ నందు ఈనెల 17వ తేదీ లోపు అందచేయాలని తెలిపారు.

కొత్త సెల్టోస్ ఆరంభంతో కియా ఇండియా ఒక మిలియన్ ప్రొడక్షన్ యూనిట్స్ సంబరాలు

విశాలాంధ్ర-రాజమండ్రి: తమ సరికొత్త ఆవిష్కరణ - ద న్యూ సెల్టోస్ మొదటి యూనిట్‌ను విడుదల చేసిన కియా ఇండియా, తమ భవిష్య తయారీ సదుపాయం అనంతపురం నుండి ఒక మిలియన్ వాహనాలను పంపిణీ చేసిన చారిత్రక మైలురాయిని సంబరం జరుపుకుంది. భారతదేశంలో లభించబోయే అత్యంత అభివృద్ధి చెందిన, సురక్షితమైన, స్మార్టర్ ఎస్ యూవీలలో ఒకటైన కొత్త సెల్టోస్ ప్రొడక్షన్ ఆరంభానికి కూడా ఈ సంబరం గుర్తుగా నిలిచింది. కొత్త సెల్టోస్ ఆధునిక డిజైన్, 17 ఫీచర్స్ తో అత్యంత ఆధునికమైన లెవెల్ 2 ఏడీఏఎస్, ఎంతగానో ఎదురుచూసిన పనోరమిక్ సన్ రూఫ్ సహా 32 భద్రతా ఫీచర్స్‌తో లభిస్తోంది. ఇది జులై 14 నుండి ప్రీ-బుకింగ్సుకోసం అందుబాటులోకి వచ్చింది.

బలహీన వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - రామచంద్రపురం : ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వివిధ పథకాలను అమలు పరుస్తుందని వీటిని సద్వినియోగం చేసుకునే బాధ్యత లబ్ధిదారులపై ఉందని, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుకు చేరుతున్న విధానాన్ని పర్యవేక్షించడమే గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర

సంబంధాలు, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని రెండవ వార్డు స్టిల్ విల్ పేటలో గడపగడపకు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై లబ్ధిదారుల నుండి స్పందనను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, స్థానిక కౌన్సిలర్, ఇతర ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం రానివ్వం

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యార్థుల భవిష్యత్తుకు ఎక్కడ ఆటంకం రాకుండా వేరే పాఠశాలలో చేర్పిస్తామని పెద్దాపురం డివిజనల్ విద్యాశాఖ అధికారిని సుభద్ర పేర్కొన్నారు. జగ్గంపేట శ్రీ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ మూసి వేస్తున్నారని, పిల్లల్ని స్కూల్ యాజమాన్యం రావద్దంటున్నారని, వేరే పాఠశాలలో ఎవరు జాయిన్ చేసుకోవడం లేదని,

తమ పిల్లల భవిష్యత్ ఏమిటని అధికారులకు ఫిర్యాదుతో ఆమె పాఠశాలను సందర్శించారు. పాఠశాల యాజమాన్యంతోను, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతోను ఆమె మాట్లాడారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించే విధంగా ఎంఈఓకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఆరు నుండి పదవ తరగతి వరకు కూడా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి టీసీలు ఇవ్వడం కూడా జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారిని వేరే పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఎంఈఓ స్వామి ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

విశాలాంధ్ర - కిర్లంపూడి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గురువారం కిర్లం పూడి మండలం కృష్ణవరం గ్రామంలో 62 లక్షల రూపాయలు జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని, 45 లక్షల రూపాయ

లతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు మంజూరైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగాపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడమే కాకుండా, నవరత్నాల పేరుతో పలు ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గామ సర్పంచ్ గొరకపూడి వీర అనంతలక్ష్మి గోపీనాథ్, ఎంపీటీసీ గొరకపూడి మమతానాగు, గొరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొరకపూడి గోపినాధ్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, తహసీల్దార్ కెవి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట శివారు వైన్ షాపు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జగ్గంపేట ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌కు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

గురునాథరావుకు చంద్రబాబు అభినందనలు

విశాలాంధ్ర - రౌతులపూడి : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గవిరెడ్డి గురునాథరావును అభినందించారు. "మన టిడిపి యాప్"లో నిరంతరం డిజిటల్ సైనికుడిలా పనిచేసి పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలోని నలుమూలల విస్తరింప

జేసినందుకు, ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలను ఎత్తి చూపినందుకు 10 వేల పాయింట్లు సాధించిన సందర్భంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురునాథరావుకు అభినందనలు తెలిపారు.

పలు గ్రామాలలో సురక్షా కార్యక్రమాలు

విశాలాంధ్ర - పెరవలి : సురక్షా కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని యంపిపి కార్చర్ల సీతారామ్ ప్రసాద్‌అన్నారు. శుక్రవారం మండలంలోని ఖండవల్లి కాపవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు



పలురకాల పత్రాలను అందించారు. యంపిపి మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం గుర్తించి అనేక పథకాల ద్వారా ప్రజలకు సర్వీసులు అందుతున్నాయన్నారు.సురక్షా కార్యక్రమం ద్వారా ప్రతీఒక్కరికి అనేక రకాల పత్రాలను ఉచితముగా పొందవచ్చునని అన్నారు.కార్యక్రమంలో తహసిల్దార్ రాజేశ్వరి, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. శుక్రవారం కిర్లంపూడి మండలం



భూపాలపట్నం గ్రామంలో బేరి జగ్గారావు, బేరి బాబ్జి ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ 2004 నుండి 2019 వరకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పార్లమెంటు సభ్యునిగా జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో జగ్గంపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తోట నరసింహా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట బాబ్జి, అత్తులూరి సాయి బాబు, ఒబిన్ని సత్యనారాయణ, తోట వేణు, రామకుర్తి మూర్తి, ఎంపీటీసీ కొరిపల్లి చందు, ఎస్ఎ గఫూర్, అడబాల సుబ్బారాయుడు, ఒలేటి రాజు, సమ్మిటి మోహన్, వేగి రామకృష్ణ, పాఠంశెట్టి సుబ్బన్న, తుమ్మల రాజా, తులా రాము, దాసరి చినబాబు, కరుటూరి శ్రీనివాస్, తాండ్రోతు గోవిందరెడ్డి, రామకుర్తి జగాలు, తోట నరేంద్ర అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, తోట నరసింహం అభిమానులు పాల్గొన్నారు.